

నేటి నుంచి బీచ్‌లోకి నో ఎంట్రీ

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెంసౌత్, కెపి పాలెం సౌత్ గ్రామాల్లో విస్తరించి ఉన్న బీచ్‌లోకి ఈ నెల 26వ తేదీ నుండి 28వ తేదీ వరకూ పర్యాటకులెవ్వరినీ అనుమతించడం లేదని ఎస్‌ఐ జి.వాసు తెలిపారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో ఆలాల ఉధృతి పెరిగే ప్రమాదం ఉన్నందున బీచ్‌లో స్నానాలకు అనుమతించడం లేదని ఆయన చెప్పారు. పర్యాటకులు, ప్రజలు తమకు సహకరించాలని కోరారు.



ఎగసి పడుతున్న అలలు

'పోలవరం' భూసేకరణలో
అవినీతి పరాకాష్ట..!


- గిరిజనుల భూములపై అడ్డగోలుగా తీర్పులు
- హైకోర్టు ఆర్డర్‌ను పక్కన పెట్టి మరీ ముందుకు
- గిరిజనేతర భూస్వాములకు మేలు చేయడమే లక్ష్యం
- 60 మందికిపైగా దళారులతో కుమ్మక్కై అధికారుల వ్యవహారం
- 20 శాతం కమీషన్లు తీసుకుంటున్నట్లు చర్చ
- భూసేకరణ అవినీతిపై జనసేన నేత కరాటం రాంబాబు వ్యాఖ్యలే సాక్ష్యం

'బుట్టాయగూడెం మండలం రెడ్డిగణపవరంలో సర్వే నెంబర్ 288లో ఉన్న 24 ఎకరాలను ఎల్‌టిఆర్ భూములుగా నిర్ధారిస్తూ 2018లో హైకోర్టు ఆర్డర్ జారీ చేసింది. హైకోర్టు ఆర్డర్‌ను ఏమాత్రం పట్టించుకోకుండా ఆ భూమికి సంబంధించి ఐటిడిఎ అధికారులు క్లియరెన్స్ ఇచ్చేసిన పరిస్థితి ఉంది. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున సొమ్ము చేతులు మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి'.

'రెడ్డిగణపవరం గ్రామసభలో సర్వే నెంబర్ ఒకటి, 344-1ఎ, 198-1, 190-2ఎతోపాటు పలు భూములకు సంబంధించి అభ్యంతరాలు తెలియజేస్తూ గ్రామసభ తీర్మానించింది. గ్రామసభ తీర్మానాన్ని పట్టించుకోకుండా అధికారులు నోటిఫికేషన్లు ఇచ్చేసి ముందుకు సాగుతున్న పరిస్థితి ఉంది'.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పైన పేర్కొన్న ఉదంతాలు మచ్చుకు మాత్రమే. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల కోసం చేపట్టిన భూసేకరణలో జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండలాల్లో అవినీతి తారాస్థాయికి చేరింది. పోలవరం నియోజకవర్గంలో జనసేన ఎంఎల్‌ఎ ఉన్నప్పటికీ, ఆ పార్టీ కీలకనేత కరాటం రాంబాబు శుక్రవారం మీడియా ముఖంగా చేసిన వ్యాఖ్యలు అందుకు ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పొచ్చు. రెవెన్యూ, ఐటిడిఎ అధికారుల అవినీతి వ్యవహారంపై అక్కడి ప్రజలు తీవ్ర ఆరోపణలు చేస్తున్న పరిస్థితి ఉంది. గిరిజనుల భూములను గిరిజనేతరులకు కట్టబెట్టేందుకు సాగుతున్న గూడుపుఠాణి చూసి అంతా ఘొల్లుమంటున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని విఆర్‌పురం, కూనవరం మండలాల్లోని 35 గ్రామాల ప్రజలను తరలించేందుకు బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలంలో 7,100 ఎకరాలు సేకరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. 6,700 ఎకరాలు భూమికి భూమి కింద, మరో 400 ఎకరాలు కాలనీల నిర్మాణానికి అవసరమని అధికారులు తేల్చారు. గిరిజనులు దశాబ్దాల తరబడి సాగు చేసుకుంటున్న భూములను గిరిజనేతర భూస్వాములకు కట్టబెట్టి లబ్ధి చేకూర్చేవిధంగా రాజకీయ దళారులతో చేతులు కలిపి అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం భూసేకరణలో ఎకరాకు రూ.15 లక్షలు చొప్పున ఇస్తోంది. దీనిలో 20 శాతం అంటే దాదాపు రూ.మూడు లక్షలు కమీషన్ల కింద తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ముందుగానే అందుకు సంబంధించిన చెక్కులపై సంతకాలు చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది. దీన్నిబట్టి చూస్తే రూ.వందల కోట్లలో అవినీతి జరుగుతున్నట్లు అంతా చెబుతున్నారు. రెడ్డిగణపవరంతోపాటు అనేక గ్రామాల్లో గిరిజనులు అధికారుల తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా అడ్డగోలుగా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. గ్రామసభల తీర్మానాలకు సంబంధించి సైతం అడ్డదారుల్లో సాగుతున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఆర్‌అండ్‌ఆర్ భూసేకరణకు సంబంధించి 60 నుంచి 80 మంది వరకూ దళారులు ఈ వ్యవహారం సాగిస్తున్నట్లు తెలుస్తోంది.



ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం

పోలవరం భూసేకరణలో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గిరిజనులు చెబుతున్నారు. అవినీతి వ్యవహారంలో కిందినుంచి పైస్థాయి అధికారుల వరకూ వాటాలు ఉన్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. ఇప్పటికే నాలుగు వేల ఎకరాలకు సంబంధించి వ్యవహారం సాగినట్లు తెలుస్తోంది. అధికారపార్టీకి చెందిన నేతలే దళారులుగా మారి ఈ వ్యవహారం నడుపుతున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై జనాల్లో తీవ్ర ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. భూసేకరణలో అవినీతిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత గిరిజనులు కోరుతున్నారు.

అవినీతిపై కుండబద్దలు కొట్టిన జనసేన నేత

పోలవరం ప్రాజెక్టు భూసేకరణలో అవినీతి వ్యవహారంపై జనసేన కీలక నేత కరాటం రాంబాబు మీడియా ముందు కుండబద్దలు కొట్టారు. పరిస్థితి అత్యంత దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు, ఇన్‌ఛార్జి మంత్రి కూడా పట్టించుకోవడం లేదని విమర్శలు గుప్పించారు. డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ జోక్యం చేసుకోవాలని కోరారు. దాదాపు 80 మంది దళారులు అధికారులతో కుమ్మక్కై 20 శాతం కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపణలు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకుంటుందో, లేదో వేచిచూడాలి.

'మొంథా' పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలి

అన్ని మండలాల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు

కలెక్టర్ వెట్రిసెల్వి


ప్రజాశక్తి - ఏలూరు



జిల్లాలో మొంథా తుపాన్ ప్రభావం తీవ్రస్థాయిలో ఉంటుందనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి విజ్ఞప్తి చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో శనివారం సాయంత్రం అత్యవసర సమావేశం నిర్వహించారు. తుపాన్ ముందస్తు చర్యలపై అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొంథా తుపాన్ కారణంగా జిల్లాలో ఈ నెల 28, 29 తేదీల్లో బలమైన గాలులు వీస్తాయని, భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. గాలులకు హోర్డింగ్లు, స్తంభాలు, బలహీనంగా ఉన్న చెట్లు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, పూరిళ్లు వంటివి కూలిపోవచ్చని, ఈ కారణంగా ప్రాణ నష్టం సంభవించకుండా అధికారులు భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్లు, స్తంభాలను, బలహీనంగా ఉన్న చెట్లను తొలగించాలని, శిథిలావస్థలో ఉన్న భవనాలు, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. కొల్లేరు లంక ప్రాంతాల్లోని ప్రజలు చేపల వేటకు వెళ్లకుండా ఆయా గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు. తుపాన్ ముప్పు తొలగేవరకూ జిల్లాలో అధికారులు, సిబ్బందికి సెలవులు రద్దు చేస్తున్నామని, వారంతా తమ పని ప్రదేశాల్లో ఉండాలని ఆదేశించారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి, సిబ్బందిని నియమించాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లోని గర్భిణులు, విభిన్న ప్రతిభావంతులు, చిన్న పిల్లలు, వృద్ధులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వరద నీరు పూర్తిగా తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, తాగునీరు కలుషితం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్‌డిఒలు అచ్యుత్ అంబరీష్, రమణ, సర్వేశాఖ ఎడి అన్సారీ, ఏలూరు కార్పొరేషన్ కమిషనర్ ఎ.భానుప్రతాప్, డిఎంహెచ్‌ఒ డాక్టర్ పిజె.అమృతం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దృష్టి దోషాలను చిన్నతనంలోనే గుర్తిస్తే నివారించొచ్చు

మంత్రి కొలుసు పార్థసారధి



మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

పిల్లల్లో దృష్టి దోషాలను చిన్నతనంలోనే గుర్తిస్తే ఆ సమస్యను పరిష్కరించొచ్చని, దృష్టి దోషాలను నివారించొచ్చని మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. సానా సతీష్ బాబు ఫౌండేషన్- ఏలూరు టీమ్ ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటివైద్య పరీక్షలు, కళ్ల జోళ్ల పంపిణీ కార్యక్రమం స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని ఈదర సుబ్బమ్మాదేవి నగర పాలక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొలుసు పార్థసారధి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎంఎల్‌ఎ బడేటి రాధాకష్ణయ్య (చంటి) ముఖ్యఅతిథులుగా విచ్చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి ఇంటిలోనూ స్మార్ట్‌ఫోన్ల వాడకం ఎక్కువైందని, దీనివల్ల పిల్లల్లో దృష్టి దోషాలు వచ్చే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్లోని అనారోగ్య లక్షణాలను చిన్నతనంలోనే గుర్తించి, చికిత్స అందిస్తే వాటిని నివారించి వారికి ఉజ్వల భవిష్యత్తు కల్పించిన వారవుతారన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు, గార్డెనింగు, పరిసరాలు పరిశుభ్రత వంటి పాఠ్యేతర కార్యకలాపాల పట్ల ఆసక్తి కలిగించాలన్నారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ మాట్లాడుతూ సానా సతీష్ బాబు ఫౌండేషన్ ద్వారా విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు, కళ్లజోళ్ల పంపిణీ అభినందనీయమన్నారు. ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాట్లాడుతూ అభివృద్ధికి విద్య ఒక్కటే రాజమార్గమన్నారు. తొలుత పాఠశాల ప్రాంగణంలోని గాంధీజీ, అబ్దుల్ కలాం, పొట్టి శ్రీరాములు, ఈదర సుబ్బమ్మ దేవి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిఇఒ ఎం.వెంకటలక్ష్మమ్మ, నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, ఏలూరు ఉడా ఛైర్మన్ పెద్దిబోయిన వాణి శివ ప్రసాద్, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఎఎస్.రామ్, ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దె భవనాల్లో అగచాట్లు

- హాస్టళ్లకు సొంత గూడు కరువు
- ఇరుకు గదుల్లో విద్యార్థుల అవస్థలు
- సొంత భవనాల నిర్మాణంపై ప్రభుత్వం నిర్లక్ష్యం

జిల్లాలో సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు కరువయ్యాయి. సగానికిపైగా వసతి గృహాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు ఇరుకుగదుల్లో నానావస్థలు పడుతున్నారు. ఒకపక్క సొంత భవనాలు లేక, మరోపక్క కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థులు పడుతున్న కష్టాలు వర్ణనాతీతం. అయితే సంక్షేమ వసతి గృహాలకు సొంత గూడు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వ్యవహరిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలను సమస్యలు పట్టిపీడిస్తున్నాయి. పరిసరాల్లో పారిశుధ్య లేమి, సరిగా లేని మరుగుదొడ్లు, తాగునీటి కొరత, దోమల బెడద, నాణ్యత లేని ఆహారం, విరిగిన బల్లలు, మంచాలు, బెడ్స్ లేక కటిక నేలపైనే నిద్ర వంటి అనేక కష్టాలు విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. జిల్లాలో బిసి సంక్షేమ శాఖ పరిధిలో 16 బోయ్స్, 13 గరల్స్ హాస్టళ్లు ఉన్నాయి. సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 15 బోయ్స్, 20 గరల్స్ హాస్టళ్లు ఉన్నాయి. మొత్తం 64 హాస్టళ్లకుగాను 32 హాస్టళ్లకు సొంత భవనాలు ఉండగా, మిగిలిన 32 భవనాలు అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. తాడేపల్లిగూడెం రూరల్ ఆరుగొలను, నరసాపురం రూరల్ ఎల్‌బిచర్లలో గురుకుల కళాశాలలు, పెనుగొండలో గురుకుల బాలికల పాఠశాల, తాడేపల్లిగూడెం రూరల్ తాడేపల్లిలో గురుకుల బాలుర పాఠశాల ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా ఆయా వసతిగృహాల్లో 5,329 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే అద్దె భవనాలు ఇరుకుగా ఉండడంతో రాత్రి సమయంలో నిద్రపోవడానికి పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు. ఒకే హాల్లో మొత్తం విద్యార్థులు నిద్రపోవాల్సిన దుస్థితి ఉంది. పరీక్షల సమయంలో అయితే విద్యార్థుల పరిస్థితి చెప్పుకోనవసరం లేదు. అంతా కలిసి కంబైన్డ్ స్టడీ చేయడం తప్ప విడిగా ప్రశాంత వాతావరణంలో చదువుకునే వెసులుబాటు ఉండట్లేదని విద్యార్థులు వాపోతున్నారు. చివరకు విద్యార్థులకు అవసరమైన సామగ్రి, విద్య సామగ్రిని భద్రపరుచుకునేందుకు సైతం సరైన వసతి సౌకర్యాలు ఉండటం లేదని విద్యార్థులు చెబుతున్నారు. దీనికి తోడు ప్రయివేటు భవనాల యజమానులు రకరకాల షరతులు విధించడంతో విద్యార్థులకు తిప్పలు తప్పడం లేదు.

ఇక సొంత భవనాలు ఉన్న హాస్టళ్లలోనూ పలు సమస్యలు తాండవిస్తున్నాయి. ఆ భవనాలు నిర్మించి ఏళ్లు గడుస్తుండటంతో కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. పాలకొల్లు ఆనంద నిలయం ప్రభుత్వ వసతి గృహం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఈ నేపథ్యంలో అక్కడ విద్యార్థులను ప్రభుత్వ కళాశాలకు చెందిన బాలికల వసతి గృహానికి తరలించారు. ప్రస్తుతం అక్కడ వారు వసతి పొందుతున్నారు.



భీమవరంలో ప్రయివేటు భవనంలో నడుస్తున్న హాస్టల్

మరమ్మతులతో మమ

జిల్లావ్యాప్తంగా 64 వసతిగృహాలు ఉన్నాయి. దీనిలో 32 అద్దె భవనాల్లో సాగుతున్నాయి. ఎస్‌సి సంక్షేమ శాఖ పరిధిలో 35 వసతి గృహాలు ఉండగా 24 హాస్టళ్లు ప్రభుత్వ భవనాల్లో, 11 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఈ భవనాలు అన్నింటికీ మరమ్మతుల నిమిత్తం ఇటీవల రూ.కోటీ 29 వేలు మంజూరయ్యాయి. 80 శాతం మరమ్మతు పనులు పూర్తయినట్లు అధికారులు వెల్లడించారు. బిసి సంక్షేమ శాఖ పరిధిలో 29 వసతి గృహాలు ఉండగా, కేవలం ఎనిమిదింటికి మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన 21 హాస్టళ్లు అద్దె భవనాల్లో ఉన్నాయి. ఇటీవల రూ.7 లక్షలతో మరమ్మతు పనులు చేపట్టి పూర్తి చేశారు. అయితే సొంత భవనాలు నిర్మించాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోకపోగా, ఉన్న భవనాలు శిథిలావస్థకు చేరినా మరమ్మతులు చేసి మమ అన్పిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రతినెలా లక్షలాది రూపాయల అద్దె చెల్లింపు

జిల్లాలో 32 ప్రభుత్వ వసతిగృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతుండటంతో ప్రతి నెలా రూ.లక్షల్లో ప్రభుత్వం అద్దె చెల్లిస్తోంది. పట్టణాల్లో స్క్వేర్ సెంటీమీటర్‌కు రూ.7, గ్రామీణ ప్రాంతాల్లోనైతే రూ.5 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. ఉదాహరణకు జిల్లా కేంద్రమైన భీమవరంలో రెండు అంతస్తుల్లో నిర్వహిస్తున్న వసతిగృహానికి ప్రతినెలా రూ.50 వేలు చెల్లిస్తున్నారు. అదే గ్రామీణ ప్రాంతాలైతే రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు చెల్లిస్తున్నారు. ప్రభుత్వం రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తుంది తప్ప విద్యార్థులకు సౌకర్యవంతంగా సొంత భవనాల నిర్మాణంపై దృష్టి పెట్టడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.3 కోట్లతో వసతిగృహం నిర్మాణానికి ప్రతిపాదన

ఎన్‌వి.అరుణకుమారి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖాధికారి



పాలకొల్లులోని ఆనంద నిలయం వసతిగృహం శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడి విద్యార్థులను పక్కనే ఉన్న కళాశాలకు చెందిన బాలికల వసతి గృహానికి తరలించి వసతి అందిస్తున్నాం. పాలకొల్లు ప్రాంతంలో రూ.3 కోట్లతో అత్యాధునిక భవనాన్ని నిర్మించేందుకు ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరు కాగానే నిర్మాణ పనులు చేపడతారు. ఇటీవల రూ.కోటీ 29 లక్షలతో 35 వసతిగృహాల్లో మరమ్మతులు చేపట్టాం. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. 80 శాతం పనులు పూర్తి చేశాం.

రూ. కోటితో మరమ్మత్తులకు ప్రతిపాదన

ఎవి.సూరిబాబు, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి



బిసి సంక్షేమ వసతిగృహాల మరమ్మతులకు చర్యలు తీసుకున్నాం. ఇటీవల కలెక్టర్ చదలవాడ నాగరాణి సమక్షంలో నిర్వహించిన సమావేశంలో వసతిగృహాల పరిస్థితిపై నివేదిక అందించాం. కలెక్టర్ ఆదేశాలతో రూ.కోటితో వసతిగృహాల మరమ్మతుకు ప్రతిపాదనలు చేశాం. నిధులు మంజూరైన వెంటనే మరమ్మతు పనులు చేపడతాం. జిల్లాలో అన్ని వసతిగృహాల్లో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

ప్రయివేట్ ట్రావెల్స్ బస్సుల తనిఖీలు

55 కేసులు నమోదు

మూడు బస్సులు సీజ్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

కర్నూలు ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదంతో రవాణా శాఖ అధికారులు ఒక్కసారిగా ఉలిక్కిపడి అప్రమత్తమయ్యారు. దీంతో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజాము వరకు ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులపై కొరడా ఝులిపించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 55 బస్సులపై కేసులు నమోదు చేశారు. వీటిలో మూడు బస్సులను సీజ్ చేశారు. ఏలూరు జిల్లా ఉప రవాణా కమిషనర్ షేక్ కరీం తెలిపిన వివరాల ప్రకారం... పెదపాడు మండలం కలపర్రు టోల్ ప్లాజా వద్ద శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి శనివారం ఉదయం ఆరు గంటల వరకు ఏలూరు ప్రాంతీయ రవాణా అధికారి, జంగారెడ్డిగూడెం ప్రాంతీయ రవాణా అధికారి సంయుక్త ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా వాహన తనిఖీ అధికారులు కలిసి వాహన తనిఖీలు నిర్వహించారు. వాహన తనిఖీల్లో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 55 బస్సులపై కేసులు నమోదు చేశారు. వీటిలో మూడు బస్సులను సీజ్ చేశారు. ఫైర్ ఎక్విప్‌మెంట్ 23 బస్సులు, పాసింజర్ల వివరాలు లేని నాలుగు బస్సులు, నిబంధనలకు విరుద్ధంగా గూడ్స్‌ను సరఫరా చేస్తున్న ఏడు బస్సులు, ట్యాక్స్ పెండింగ్‌లో ఉన్న రెండు బస్సులు, ఎమర్జెన్సీ డోర్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా సీటు ఏర్పాటు చేసిన ఒక బస్సు, డార్జిలింగ్ లైట్లు ఏర్పాటు చేసిన 18 బస్సులపై కేసులు నమోదు చేశారు. వీటిలో ట్యాక్స్ పెండింగ్‌లో ఉన్న రెండు బస్సులను, ఎమర్జెన్సీ గౌరవ సీటు ఏర్పాటు చేసిన ఒక బస్సును సీజ్ చేసి రవాణా శాఖ కార్యాలయానికి తరలించారు. ఈ తనిఖీలు కొనసాగుతాయని వారు తెలిపారు. ఈ తనిఖీల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శేఖర్, ప్రసాద్, రమేష్, అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు జగదీష్, కళ్యాణి, కృష్ణవేణి, స్వామి, బద్రునాయక్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బస్సులను తనిఖీ చేస్తున్న అధికారులు

కలకలం.. కలవరం..!



ప్రకృతి ప్రకోపం.. రోడ్ల దుస్థితి రెండు జిల్లాల ప్రజల్లో కలకలం సృష్టించగా, భీమవరం డిఎస్‌పి వ్యవహారం కూటమిలో కలవరం సృష్టించింది.

ప్రస్తుతం జిల్లా మొంథా తుపాన్ పడగ నీడలో ఉంది. రానున్న నాలుగు రోజులు పరిస్థితి భయానకంగా ఉంటుందనే హెచ్చరికలతో సామాన్య ప్రజానీకంతోపాటు వరి, ఆక్వా రైతుల్లో తీవ్ర గుబులు రేపుతోంది. ఎందుకంటే ఇప్పటికే నాలుగైదు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పంటపొలాల్లోకి నీళ్లు చేరాయి. పంట, మురుగు కాల్వలు నిండుకుండల్లా ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో పొలాల్లో నీరు తగ్గకుండానే మరోసారి తుపాన్ ముప్పు ముంచుకురావడంతో వరి పంట చేతికొచ్చేనా అనే ఆందోళన నెలకొంది. ఎందుకంటే ఈనిక దశలో ఉన్న పొలాలు ఈదురుగాలులకు కచ్చితంగా నేలనంటే ప్రమాదం ఉంది. వాటిని మాసూళ్లు చేయాలన్నా అదనపు ఖర్చు తప్పనిసరి. ఈ దశలో నేలనంటడంతో దిగుబడి గణనీయంగా తగ్గడంతోపాటు నాణ్యత లేదనే పేరుతో ధర తగ్గించే ప్రమాదం ఉంది. ప్రకృతి ప్రకోపానికి పంట చివరి దశలో కోల్పోయే ప్రమాదం ఉందని వరి రైతులు వాపోతున్నారు. ఇక ఆక్వా రైతుల పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అనే చందంగా తయారైంది. ఓపక్క వైరస్‌ల దాడితో సతమవుతూ, మరోపక్క ట్రంప్ సుంకాల ప్రభావంతో విలవిల్లాడుతుండగా విడవకుండా కురుస్తున్న వర్షాలతో ఆక్సిజన్ అందక రొయ్యలు, చేపలు తేలిపోతున్నాయని ఆక్వా రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఈ క్రమంలో మొంథా తుపాన్ ఎటువంటి ప్రభావం చూపుతుందోనని తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఇక ఇప్పటికే అధ్వానంగా ఉన్న రోడ్లు ఈ వర్షాలకు మరింత ఛిద్రమయ్యాయి. దీంతో ఇంటి గడప దాటి రోడ్డెక్కాలంటే జనం బెంబేలెత్తుతున్నారు. రోడ్డెక్కితే గుంతలే కన్పిస్తుండటంతో రోడ్డెక్కడుందో వెతుక్కుంటూ రాకపోకలు సాగించాల్సి వస్తుందంటే అతిశయోక్తి కాదు. మొత్తంగా వరుస వర్షాలు రెండు జిల్లాల్లోని అన్ని తరగతుల ప్రజల్లో కలకలం సృష్టిస్తున్నాయి.

ఇక భీమవరం డిఎస్‌పి జయసూర్య వ్యవహారం కూటమిలో నివురుగప్పిన నిప్పులా తయారైంది. ఒక డిఎస్‌పి స్థాయి అధికారి గురించి నేరుగా డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ జోక్యం చేసుకోవడమే పెద్ద చర్చనీయాంశమవ్వగా, ఆ అధికారి మంచోడంటూ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు మాట్లాడటం, దానిపై జనసేన శ్రేణులు భగ్గుమనడం చకచకా సాగిపోయాయి. దీంతో తనకు తెలిసిన సమాచారం మేరకే మాట్లాడానని, పవన్ కళ్యాణ్‌కు తెలిసిన సమాచారమే నిజమైనా కావొచ్చు అని డిప్యూటీ స్పీకర్ నష్ట నివారణకు యత్నించినా కూటమిలో భీమవరం ప్రాంతంలో జనసేన, టిడిపి మధ్య నెలకొన్న విభేధాలను ఈ చర్చ ప్రతిబింబిస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. సిఎం చంద్రబాబు విదేశాల నుంచి వచ్చాక డిఎస్‌పిపై చర్యలుంటాయా లేక సర్దిచెప్పి టీ కప్పులో తుపాన్‌లా చల్లార్చుతారో వేచి చూడాలి. ఏదేమైనా ఇరువురు కీలకమైన నేతలు రెండు జిల్లాల్లో అత్యంత ముఖ్యమైన పోలవరం నిర్వాసితులు, భూసేకరణలో అక్రమాలు, రోడ్ల దుస్థితి, ట్రంప్ సుంకాలతో ఆక్వా రైతులు పడుతున్న కష్టాలు వంటి ప్రధాన సమస్యల పరిష్కారానికి దృష్టి సారించకుండా ఒక అధికారి చుట్టూ కేంద్రీకరించడం ఏమిటని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాల్లో ముఖ్యమైన సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తే జనానికి ఉపయోగకరమని పరిశీలకులు చెబుతున్నారు. ఏదేమైనా డిఎస్‌పి వ్యవహారంపై సాగిన చర్చ కూటమిలో కలవరం సృష్టించిందనే చెప్పొచ్చు.

- విఎస్ఎస్‌వి.ప్రసాద్

27న ధర్నా జయప్రదం చేయాలి

సొసైటీ ఉద్యోగుల యూనియన్ పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సహకార సంఘాల ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం విజయవాడలోని ఎపి స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ వద్ద ఈ నెల 27న తలపెట్టిన ధర్నాను జయప్రదం చేయాలని ఏలూరు జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ అధ్యక్షులు కెవివి.సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ పూజారి సుబ్బారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సహకార ఉద్యోగుల వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, గ్రాట్యూటీ చట్ట ప్రకారం వర్తింపజేయాలని, 2019 తర్వాత చేరిన ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీని ఉద్యోగులకు వర్తింపజేయాలని కోరారు. 2019లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన జిఒలను గత ప్రభుత్వంలో అధికారులు అమలు చేస్తున్నట్టుగా నటించి ఏడేళ్లు గడిపారని, ఆ అధికారులే ఈ ప్రభుత్వంలోనూ కొనసాగడం వల్ల తమ డిమాండ్లు నెరవేరడం లేదని పేర్కొన్నారు. ఈ డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికే ఈ ధర్నా చేస్తున్నామని తెలిపారు.

వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, పాడైపోయిన రోడ్లకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల వల్ల వివిధ పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. నష్టపోయిన రైతాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలో వరి, పత్తి, పొగాకు, మినుములు, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లిందని తెలిపారు. పంటల నష్టాలను నమోదు చేసి అన్ని పంటలకు పరిహారం చెల్లించాలని పేర్కొన్నారు. ఇంకా తుఫాన్ హెచ్చరికలు ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంటలు నష్టపోవడం విషయంలో జిల్లాలో అత్యధికలుగా వ్యవసాయం చేస్తున్న కౌలు రైతులే బాధితులుగా ఉన్నారని, వారిని ఆదుకునేందుకు పంటల బీమాను వర్తింపచేయాలని తెలిపారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు చాలాచోట్ల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని, వాటిని వెంటనే యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని, వీలుపడని చోట్ల కొత్త రోడ్లు వేయాలని పేర్కొన్నారు. ఏలూరు నుంచి పెదపాడుకు వెళ్లే రోడ్డు, ఏలూరు నుంచి జంగారెడ్డిగూడేనికి వెళ్లే రోడ్డు, ఏలూరు నుంచి చింతలపూడికి వెళ్లే రోడ్డు, చింతలపూడి నుంచి టి.నర్సాపురానికి వెళ్లే రోడ్డు, జీలుగుమిల్లి నుంచి మక్కినవారిగూడేనికి వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా పాడైపోయాయని, ఈ రోడ్ల వల్ల ప్రయాణం చేసేవారు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. శిథిలావస్థకు వచ్చిన వంతెనలు, కల్వర్టులు తిరిగి నిర్మించాలని, రోడ్ల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రవాణా ఇబ్బందులను తొలగించాలని పేర్కొన్నారు. లేకపోతే సిపిఎంగా ప్రజలను సమీకరించి ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

భోజన సదుపాయం లేని పునరావాస కేంద్రం

కలిదిండి :పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి భోజన సదుపాయం కల్పించకపోవడంతో సుమారు 12 కుటుంబాల వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మం డలం లోని పడమటిపాలెం పరిధిలోని బంకు కాలని ఇళ్లలోకి నీరు చేరడంతో రెవెన్యూ అధికారులు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వారికి శుక్రవారం పునరావాసం కల్పించి, భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. శనివారం భోజనాలు వస్తాయనే వారి ఆశలు అడియాశలయ్యాయి. రెవెన్యూ సిబ్బందిని అడిగితే మాకు ఎవరూ చెప్పలేదని, తెలియదన్నార న్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమని ఆదుకోవాలని కోరారు.

భారీ వర్షం.. దళితవాడలు జలమయం

నీరు బయటకు వెళ్లే మార్గం చూపాలంటూ వేడుకోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి


దళితవాడలో మోకాలు లోతు నీరు


మండలంలో గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షానికి లోతట్టు దళిత వాడలు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. భారీ వర్షాలకు జిల్లాలోని అధిక వర్షపాతం ముదినేపల్లి మండలంలో నమోదైంది. నాలుగు రోజులుగా దంచి కొట్టిన వర్షానికి మండలంలోని పలు దళితవాడ ఎస్‌సి కాలనీలు జలమయం అయ్యాయి. కుండపోత వర్షానికి గ్రామాల్లో అంతర్గత రోడ్లు పూర్తిగా వరద నీటితో నిండిపోవడంతో ఆయా గ్రామాల్లోని నివాసితులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. అంతర్గత రోడ్లపై భారీగా నీరు చేరింది. దీంతో రాకపోకలు సాగించేందుకు పాదచారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నాలుగు రోజులుగా కురిసిన వర్షం శనివారం విరామం ఇచ్చింది. మంగళవారం నుంచి కురిసిన వర్షంతో మండలంలోని ఆల్లూరు దళితవాడ పూర్తిగా జలమయమైంది. మోకాలు లోతు నీళ్లలో దళితులు నడిచి వెళ్తున్నారు. నీరు బయటకు వెళ్లే మార్గం లేక దళితవాడలో దుర్గంధం వెదజల్లుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే చేవూరు వైఎస్ఆర్ కాలనీ, పెయ్యేరు, అన్నవరం, గురజ జగనన్న కాలనీల్లో నివాసం చుట్టూ నీరు భారీగా చేరింది. నీరు బయటకు పోయే మార్గం లేకపోవడంతో ఇళ్ల చుట్టూ నిలిచిపోయింది. దీంతో మురుగు నీరు దుర్గంధం వెదజల్లడంతో రోగాలు బారిన పడుతున్నట్లు ఆయా గ్రామాల కాలనీవాసులు చెబుతున్నారు. పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే వరద నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


రోడ్డుపై గుంతల వద్ద కర్రకు కట్టిన చెట్టు కొమ్మ

ప్రమాదకరంగా గుంతలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి - గుడ్లవల్లేరు రహదారిలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద రహదారిపై ఏర్పడ్డ గుంతలు యమ డేంజర్‌గా మారాయి. ఇక్కడ రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు వాహనదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. భారీ వర్షాలకు ఈ భారీ గుంతల్లో నీరు చేరింది. దీంతో రోడ్డు ఏదో గుంత ఏదో తెలియక ద్విచక్ర వాహనదారులు తికమక పడుతూ గుంతల్లో పడి క్షతగాత్రులుగా మారుతున్నారు. గత నాలుగు రోజులుగా ఈ గుంతల్లో 30 మందికి పైగా ద్విచక్ర వాహనదారులు పడినట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో స్థానికులు ఈ గుంతల వద్ద వాహనదారులు పడకుండా కర్రకు చెట్టుకొమ్మలు కట్టి హెచ్చరిక ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి ఈ గుంతలు పూడ్చి జనం ప్రాణం కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న రైతులు

పిఎం జన ఔషధ కేంద్రాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - ముసునూరు

పిఎం జన ఔషధ కేంద్రాల్లో అతి తక్కువ ధరలకే బ్రాండెడ్ మందులు లభిస్తాయని ముసునూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ చైర్మన్ దేవినేని శ్రీధర్ అన్నారు. మండల పరిధిలోని ముసునూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు జన ఔషధ వైద్య పరీక్షలు ఉచితంగా చేసి అతి తక్కువ ధరలకే మందులు అందించనున్నట్లు తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని దేవినేని శ్రీధర్ కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి దాసిరెడ్డి లక్ష్మణకుమార్, సొసైటీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

భార్యాభర్తలు బైక్‌పై దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొనడంతో భార్య మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని అడవినెక్కలం గ్రామంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామానికి చెందిన దేవరశెట్టి ప్రమీల దేవి(64) తన భర్త అప్పారావుతో కలిసి శనివారం ఆగిరిపల్లి మండల పరిధిలోని నెక్కలం గొల్లగూడెంలోని వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లారు. దర్శనం అనంతరం దంపతులిద్దరూ తమ ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. ఈ క్రమంలో అడవినెక్కలం సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రమీలా దేవి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళ అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మహిళ అదృశ్యంపై టి.నరసాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రమైన టి.నరసాపురం పంచాయతీలోని మెట్టగూడెం గ్రామానికి చెందిన ములికి మహాలక్ష్మి భర్త నాలుగేళ్ల క్రితం చనిపోయాడు. దీంతో ముత్యాలమ్మపేట గ్రామ శివార్లలో ఉన్న కాంచనమాల పామాయిల్ తోటలో మకాం ఉంటున్న కుటుంబ సభ్యులతో నివాసం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 24వ తేదీన మండలంలోని బొర్రంపాలెం చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఆమె ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో ఆమె తండ్రి కలవకొల్లి వెంకన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


ప్రజాశక్తి - ముసునూరు

వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన మండలంలోని వేల్పుచర్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేల్పుచర్ల గ్రామానికి చెందిన జోగి వెంకటరంగారావు (49) గ్రామంలో శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లాడు. ఎంతసేపటికి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు అతని కోసం వెతికారు. శనివారం ఉదయం పొలం సమీపంలోని నీటి తొట్టెలో వెంకటరంగారావు మృతదేహం కనిపించింది. మృతుని సోదరుడు జోగి లక్ష్మణరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.

జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలు మరింత విస్తృతం

ఏలూరు ఎంపీ మహేష్‌కుమార్, ఎంఎల్ఎ బడేటి చంటి

కార్డియాలజీ, యూరాలజీ సేవల విభాగాలు ప్రారంభం


మాట్లాడుతున్న ఎంపీ, ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ జిల్లా సర్వజనాసుపత్రిలో వైద్య సేవలను మరింత విస్తృతం చేస్తున్నామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి చెప్పారు. ఏలూరులోని జిల్లా సర్వజన ఆసుపత్రిలో శనివారం విజయవాడకు చెందిన అను న్యూరో, కార్డియాక్ హాస్పిటల్ సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత ఒపి వైద్యసేవలను ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎంఎల్ఎ బడేటి చంటి ప్రారంభించారు. ఇకపై ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఆసుపత్రిలో ఉచిత కార్డియాలజీ, యూరాలజీ ఒపి సేవలను అందించనున్నారు. ఈ సందర్భంగా కార్డియాలజీ, యూరాలజీ సేవల విభాగాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అనంతరం ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ రానున్నకాలంలో ఆసుపత్రి అభివృద్ధికి మరింత పటిష్టవంతమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్.రాజు, అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ కిరణ్ కుమార్, కార్డియాలజిస్ట్ డాక్టర్ దినేష్‌రెడ్డి, యూరాలజిస్ట్ డాక్టర్ పవన్ సాయి, టిడిపి నాయకులు బెల్లపుకొండ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రముఖులు

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - చింతలపూడి

చట్టాలపై ప్రజలు ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలని చింతలపూడి కోర్టు మేజిస్ట్రేట్ మధుబాబు చెప్పారు. ప్రాథమిక చట్టాలు, ముఖ్యంగా భూ వివాదాలు, కుటుంబ తగాదాలు, ఆస్తి పంపకాలకు సంబంధించిన చట్టాలపై ఆయన వివరించారు. చింతలపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలోని నామవరం గ్రామంలో స్థానిక ప్రజలకు చట్టాలపై, న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించేందుకు శనివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్, న్యాయ వ్యవస్థ పాత్ర, న్యాయస్థానాలు ప్రజలకు ఎలా సహాయపడతాయో, కేసు నమోదు ప్రక్రియ ఎలా ఉంటుందో, న్యాయం పొందడానికి అనుసరించాల్సిన మార్గాల గురించి వివరించారు. ఆర్థికంగా వెనుకబడినవారికి ఉచిత న్యాయ సహాయం పొందే అవకాశాలను, అందుకోసం సంప్రదించాల్సిన అధికారుల వివరించారు. తక్షణ పరిష్కారం చిన్నపాటి వివాదాలు లేదా తగాదాలను కోర్టుల వరకు తీసుకెళ్లకుండా, గ్రామస్థాయిలో లేదా లోక్ అదాలత్ ద్వారా సామరస్యంగా పరిష్కరించుకోవడం వల్ల కలిగే సమయం, డబ్బు ఆదా గురించి తెలిపారు. సిఐ క్రాంతికుమార్, ఎస్ఐ సతీష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా, ఏదైనా సమస్య వచ్చినప్పుడు వెంటనే పోలీసులను సంప్రదించాలని, తద్వారా న్యాయపరమైన మార్గంలో సమస్యకు పరిష్కారం లభిస్తుందని సూచించారు. నామవరం గ్రామస్తుల్లో చట్టాలపై, న్యాయ ప్రక్రియపై అవగాహన పెంచడానికి ఈ కార్యక్రమంలో ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సతీష్‌కుమార్, న్యాయవదులు, తదితరులు పాల్గొన్నారు.

'ఎపి ఎక్సైజ్ సురక్ష'తో నకిలీ మద్యానికి చెక్

ప్రజాశక్తి - చింతలపూడి

ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ ద్వారా మద్యం బాటిల్స్‌ను స్కాన్ చేసి సేల్ చేయాలని జి.పాండురంగారావు అన్నారు. చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పలు మద్యం షాపుల్లో, ఒక రెస్టారెంట్ అండ్ బార్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎపి ఎక్సైజ్ సురక్ష యాప్ క్యూఆర్ కోడ్ అందించారు. ఎక్సైజ్ షాపు బార్ రూల్స్‌లను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎపి సురక్ష యాప్ గురించి వినియోగదారులకు అవగాహన కల్పించారు. పోస్టర్లను బ్రాందీ షాపు వద్ద అతికించి, పాంప్లెట్స్‌లను కొనుగోలుదారులకు యాప్‌లో మద్యం నాణ్యమైనదని తెలుసుకోవడం గురించి వివరించారు.

డిప్యూటీ ఎంపిడిఒగా ఆశీర్వాదం

ప్రజాశక్తి - దెందులూరు



దెందులూరు మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఒగా బి.ఆశీర్వాదం విధుల్లో చేరారని ఎంపిడిఒ బి.శ్రీదేవి తెలిపారు.



అవగాహనా ర్యాలీ

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులు విద్యార్థి దశ నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవాలని ముసునూరు గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపల్ కె.లక్ష్మీకుమారి అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు గురుకుల బాలికల పాఠశాలలో బేటి బచావో- బేటి పడావో కార్యక్రమం అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశలోనే మంచి క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. బయట వ్యక్తులు అసభ్యకరంగా మాట్లాడిన, ప్రవర్తించిన ఆ విషయం వెంటనే ఉపాధ్యాయులకులేదా తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. అందుబాటులో లేని సమయంలో 1098 నెంబర్‌కు కాల్ చేసినట్లయితే, పోలీసు వ్యవస్థ ద్వారా రక్షణ కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, గురుకుల బాలికల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు, ఆశాలు ఐక్యంగా ఉండాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి రాజు

ప్రజాశక్తి - ముసునూరు

అంగన్వాడీలు, ఆశాలు పలు రంగాల కార్మికులు ఐక్యంగా ఉంటే ఏ ప్రభుత్వాలైనా మననేమీ చేయలేవని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు తెలిపారు. మండల కేంద్రమైన ముసునూరు సిపిఎం కార్యాలయంలో సిఐటియు ప్రత్యేక సమావేశం మండలంలోని 16 గ్రామాల పలు రంగాల కార్మికులతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 31వ తేదీ నుంచి 2026 జనవరి నాలుగో తేదీ వరకు ఐదు రోజుల పాటు అఖిల భారత 18వ మహాసభ విశాఖపట్నం మహానగరంలో మొట్టమొదటిసారిగా నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభలో అన్ని రంగాల కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అదే విధంగా దేశ వ్యాప్తంగా యావత్తు కార్మిక వర్గాన్ని ఐక్య పరచటం, కార్మిక, కర్షక ఐక్యత గురించి పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చి, కార్మిక రాజ్యాన్ని స్థాపించటం సిఐటియు లక్ష్యమని, ఈ సాధన ద్వారానే కార్మిక వర్గం నేడు ఎదుర్కొనే సర్వ సమస్యలను పరిష్కరిస్తుందని అవగాహన కల్పించారు. స్కీమ్ వర్కర్లకు, బిల్డింగ్, మైనింగ్, బీడీ కార్మికులు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు ఇలా ఎందరో కార్మికులు సిఐటియు ద్వారా అభివృద్ధి పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కమలకుమారి, సిఐటియు మండల నాయకులు కొడవలి శ్రీనివాస్, ఆశా మండల నాయకురాలు మద్దాల సునీత, పలువురు కార్మికులు, ఆశాలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

అరిస్టాటిల్ తత్వం అంశంపై అవగాహన



మాట్లాడుతున్న ప్రముఖులు

ప్రజాశక్తి - చింతలపూడి

అరిస్టాటిల్ తత్వం చాలా ప్రాచీనకాలానికి చెందినప్పటికీ అన్ని శాస్త్రాలపై ఆయన ప్రభావం అధికంగా ఉందని చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఏలూరు కళాశాల కలిసి రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అరిస్టాటిల్ తత్వం అంశంపై అతిథి ఉపన్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చింతలపూడి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రపంచంలో మొట్టమొదటిసారిగా మానవ ప్రవర్తనను అధ్యయనం చేసిన వ్యక్తి అరిస్టాటిల్ అన్నారు. జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర ఉపన్యాసకులు ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ అరిస్టాటిల్‌తత్వం నేటి ఆధునిక కాలంలో రాజనీతి తత్వవేత్తల పైన అపారమైన ప్రభావం చూపించిందన్నారు. రాజనీతి శాస్త్ర పితామహుడు అయిన అరిస్టాటిల్ ఆధునిక కాలంలో అనేక కొత్త సిద్ధాంతాలు పుట్టడానికి ప్రేరణ ఇచ్చారని, అరిస్టాటిల్ తత్వాన్ని అధ్యయనం చేయటం వల్ల సమకాలీన సమస్యలకు పరిష్కార మార్గాలు కనుకోవచ్చని చెప్పారు. కళాశాల రాజనీతి శాస్త్ర విభాగ ఉపన్యాసకులు కె.హరిప్రసాద్ మాట్లాడుతూ అరిస్టాటిల్ తత్వం లేకుండా ప్రాచీన గ్రీకురాజనీతి తత్వాన్ని ఊహించలేమని తెలిపారు.

తుపాన్ దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలి

నారుమడుల్లో వరద నీటిని బయటకు పంపాలి

మండల వ్యవసాయ శాఖాధికారి గంగాధర్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపాన్‌గా మారనున్న దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖాధికారి కాళింగి గంగాధర్ రైతులకు తెలిపారు. నారుమడుల్లో వరద నీటిని బయటకు పంపాలన్నారు. కోతకొచ్చిన వరి చేలను కోయకుండా మూడు రోజులు వాయిదా వేసుకోవాలని తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరి చేలు నీట మునిగిన చోట నీటిని బయటకు పంపాలని సూచించారు. పడిన చేలను పైకి లేపాలని సూచించారు. మండలంలో చాలా చోట్ల పొట్ట పోసుకునే దశలో ఉండటంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి రైతు దగ్గరలోని రైతు సేవ కేంద్రంలో ఇ-పంట, ఇ-కెవైసి నమోదు చేయించుకోవాలని తెలిపారు.

చెరువు నీరు కలుషితంతో తీవ్ర నష్టం

తహశీల్దార్‌కు గ్రామస్తుల ఫిర్యాదు


ప్రజాశక్తి - జీలుగుమిల్లి


వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

జీలుగుమిల్లి శివారులో ఉన్న తూముల చెరువులో అశ్వారావుపేట పేపర్ బోర్డుకు సంబంధించిన వ్యర్థజలాలు కలిసి నీరు కలుషితమై పంటలకు, పశువులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని మండలంలోని వంకావారిగూడెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి తెల్లం దుర్గారావుతో పాటు పలువురు గ్రామస్తులు శనివారం అశ్వారావుపేట తహశీల్దార్ సిహెచ్.రామకృష్ణకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలో ఉన్న శ్రీ లక్ష్మీపేపర్ బోర్డు నుంచి కెమికల్ వ్యర్థాలతో కలిసిన నీరు తూము చెరువులో కలవడం ద్వారా పశువులు వ్యాధుల బారిన పడటంతో పాటు, పలు చేపలు మృత్యువాత చెందుతున్నాయని, అదే విధంగా కలుషిత నీరు పంట పొలాల్లోకి కలవడం ద్వారా వ్యవసాయంలో కూడా దిగుబడి తగ్గి నష్టాల బారిన పడుతున్నామని గ్రామానికి చెందిన పలువురు రైతులు వాపోతున్నారన్నారు. పేపర్ బోర్డు నీటిని చెరువులోకి రాకుండా చూడాలని, నష్టం కలిగిస్తున్న పేపర్ బోర్డు యాజమాన్యంపై తగు చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయనతో పాటు ఉప సర్పంచి శేషగిరిరావు, దాసరి రామారావు, సాయి, హేమంత్, పలువురు గ్రామస్తులు ఉన్నారు.

అమరావతి నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - ముదినేపల్లి


డాక్టర్ మనోజ్ ను సన్మానిస్తున్న గ్రామ ప్రముఖులు

అమరావతి నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని ముదినేపల్లికి చెందిన ప్రముఖ వైద్యులు అంబుల మనోజ్ అన్నారు. శనివారం ముదినేపల్లి మండలంలోని ఉప్పరగూడెంలో చేయి చేయి కలుపుదాం.. అమరావతిని నిర్మిద్దాం, అమరావతికి జీవం పోదాం రూ.116 సాయం చేద్దాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు రూ.116 విరాళాలను ఎపిసిఆర్‌డిఎ బ్యాంకు ఖాతాకు క్యూఆర్ కోడ్ ద్వారా పంపించారు. అనంతరం గ్రామస్తులు డాక్టర్ మనోజ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇఒ సింగనపల్లి శ్రీనివాసరావు, సొసైటీ మాజీ అధ్యక్షులు శ్రీనివాసరావు, న్యాయవాది బంగారయ్య, ఎం.శివ, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్‌పై కొట్టుకుపోయిన రోడ్డు

తాత్కాలికంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

అధికారులు స్పందించాలని కోరుతున్న ప్రజలు

ప్రజాశక్తి - కలిదిండి

కలిదిండి నుంచి కైకలూరు వెళ్లే మార్గంలోని కాల్వా డ్రెయిన్‌పై రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోవడంతో తాత్కాలికంగా రెండు కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాటు వల్ల పిల్లలకు, వృద్ధులకు ప్రమాద భరితమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్క గ్రామానికి వెళ్లాలంటేనే 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. బైక్‌లపై రెండు మూడు మేతకట్టలు తీసుకువెళ్లాలన్నా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని ఆక్వా సాగు చేసే సన్న, చిన్నకారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే కనీస చర్యలు చేపట్టి వాహన రాకపోకలు జరిగేలా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.


డ్రెయిన్‌పై ప్రమాదకరంగా స్తంభాలు

వైద్య కళాశాలలను ప్రయివేటీకరించొద్దు

28న ప్రజా ఉద్యమం : వైసిపి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఈ నెల 28వ తేదీన నిర్వహించే ప్రజా ఉద్యమం పోస్టర్‌ను పట్టణంలోని వైసిపి కార్యాలయంలో నూజివీడు మాజీ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ పిపిపి విధానం పేరుతో వైద్య కళాశాలలను ప్రయివేట్‌పరం చేయడం శోచనీయమన్నారు. మెడికల్ కళాశాలలను పేద కుటుంబ పిల్లలకు దూరం చేస్తూ బంగారు కుటుంబాల పేరుతో పేదవారికి ఏదో చేస్తున్నట్లు గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం చేస్తున్నారన్నారు. వైసిపి హయాంలో రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలకు ఏడు మెడికల్ కళాశాలలు ప్రారంభించి వాటిలో క్లాసులు జరుగుతుండగా ప్రయివేట్‌పరం చేయాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా చిన్నారావు

ప్రజాశక్తి - పోలవరం

యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా ముద్రగడ చిన్నారావు ఎన్నిక పట్ల శనివారం పోలవరం మండల యాదవ సంఘం అధ్యక్షులు రాచూరి వెంకటరామకృష్ణ, గొర్రెల మేకల సంఘం అధ్యక్షులు కొరసిక నాగబాబు, యాదవ సంఘం నాయకులు మాగంటి రాము, పాయల శ్రీను, బొట్టా శ్రీను, పిల్లంగోళ్ల వెంకటేశ్వరరావు, గోదావరి వేణు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం మండలాధ్యక్షులు రాచూరి వెంకటరామకృష్ణ, గొర్రెల మేకల సంఘం అధ్యక్షులు కొరశిక నాగబాబు మాట్లాడుతూ యాదవులు రాజకీయంగా చైతన్యం కావాలన్నారు. ఐకమత్యంతో ఉండి సామాజికంగా, ఆర్థికంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. మండలానికి ఉపాధ్యక్షులుగా ఎన్నికైన చిన్నారావు యాదవులకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అందేటట్లుగా కృషి చేయాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన యాదవులకు అండగా యాదవ సంఘం నిలబడుతుందన్నారు. జిల్లా ఉపాధ్యక్ష పదవికి చిన్నారావును ఎన్నిక చేసిన జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు ముమ్మిడి చింతయ్య, బాలుయాదవ్, మహేష్ యాదవులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పారిజాత గిరి వెంకన్నకు రూ.2 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం ఉత్తరం వైపు ఏడుకొండల్లో ఆరో కొండపై పారిజాత వృక్షాల్లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం పూజ టికెట్లు, ప్రసాదాలు, విరాళాల ద్వారా సుమారు రూ.రెండు లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణది అధికారి కలగర శ్రీనివాస్ తెలిపారు. వేలాది సంఖ్యలో అయ్యప్ప స్వాములు, గోవింద స్వాములు, యాత్రికులు కాలినడకన శ్రీ స్వామివారి కొండపైకి చేరుకున్నారు. జంగారెడ్డిగూడేనికి చెందిన అబ్బిన దత్తాత్రేయ, సత్యవతి కుటుంబ సభ్యులు అన్నదానానికి విరాళం అందించారు. వారికి ఆలయ ఇఒ శ్రీనివాస్, ప్రధాన ఆచార్యులు రవికుమార్, ఆచార్యులు కుమార్, రాఘవాచార్యులు స్వామి వారి శేష వస్త్రాలు ప్రసాదాలు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేరిచర్ల జగపతి రాజు, రెడ్డి రంగప్రసాద్, ఇళ్ల రామ్మోహన్‌రావు, దండు ధనరాజు, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర సన్నిధిలో ఎంఎల్‌సి జయమంగళ

ప్రజాశక్తి - ముదినేపల్లి

నాగుల చవితిని మండల ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని సింగరాయపాలెం గ్రామంలో ఉన్న శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామినినాగుల చవితి సందర్భంగా పెద్ద సంఖ్యలో యాత్రికులు దర్శించుకున్నారు. ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణ, పుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఎసి ఆర్.గంగాశ్రీదేవి జయమంగళ వెంకటరమణకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి పట్టు వస్త్రాలతో సన్మానించి స్వామివారి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీహరిపురం గ్రామ సర్పంచి పరసా విశ్వేశ్వరరావు, బొంగు రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవా కేంద్రాలను వినియోగించుకోండి

ప్రజాశకి - ముసునూరు

గ్రామ సచివాలయాల్లో ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్ ద్వారా విద్యార్థులు ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలని ఎంపిడిఒ పిల్లి ఏసుబాబు తెలిపారు. మండలంలోని చెక్కపల్లి, చింతలవల్లి, ముసునూరు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఆధార్ సేవా కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉప ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ, గ్రామ సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.